నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు | నంద్యాల

బుధవారం | 08 జనవరి 2025 | పేజీలు 8


# నంద్యాల సబ్ రిజిస్ట్రార్ పై సస్పెన్షన్ వేటు


సస్పెండ్ అయిన నంద్యాల సబ్ రిజిస్ట్రార్ -1 అబ్దుల్ సత్తార్

- మూడు నెలలకే వేటు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అలజడి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** నంద్యాల సబ్ రిజిస్టార్ -1 అబ్దుల్ సత్తార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నంద్యాలలో విధుల్లో చేరిన మూడు నెలలకే సస్పెన్షన్ వేటు పడింది. ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో స్టే అర్డర్‌తో పాటు ఇంజక్షన్ ఉన్న పొద్దుటూరు లోని ఒక స్థిర అస్థిని నంద్యాల సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి కల్యాణి అబ్దుల్ సత్తాన్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే..నంద్యాల సబ్ రిజిస్టార్ -1గా అబ్దుల్ సత్తార్ గత ఏడాది సెప్టెంబర్ 25న విధుల్లో చేరారు. ఆళ్లగడ్డ సబ్ రిజిస్టార్‌గా పని చేస్తున్న అబ్దుల్ సత్తార్ గత ఏడాది సాధారణ బదిలీల్లో భాగంగా మిగతా 2లో

## ప్రవాసనంగా జిఎన్ఎం పరీక్షలు

- 45 నిమిషాలు ఆలస్యంగా పరీక్షల నిర్వహణ
- ఇదో అనధికారిక పేపర్ లీకేజా..?
- కళాశాల యాజమాన్యాలతో అధికారుల మిలాఖత్ కారణమా..?
- కో-ఆర్డినేషన్ పేరుతో సిబ్బంది ఇష్టారాజ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** కర్నూలు జిల్లాలో జనరల్ నర్సింగ్ సంవత్సర పరీక్షలు ప్రహసనంగా మారాయి. రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ అధికారుల నిర్లక్ష్యం..ప్రైవేటు కళాశాల ల యాజమాన్యాలతో మిలాఖత్ అయిన సిబ్బంది ఇష్టారాజ్యంతో జీఎన్ఎం పరీక్షలు తూ.తూ.మంత్రంగా నిర్వహిస్తున్నారు. పరీక్షల షెడ్యూల్‌కు సంబంధించిన అధికారులు ఇష్టారీతిన సమయపాలన లేకుండా వ్యవహరిస్తున్నారు. కేవలం పాస్‌వర్డ్‌ను సాకుగా చూపుతూ 40నిమిషాల నుంచి గంటసేపు ఆలస్యంతో విద్యార్థులకు ప్రశ్న పత్రాలను అందజేస్తూ పరీక్షలను ప్రహసనంగా మార్చివేశారు. కొందరు అధికారులు, సిబ్బంది ప్రైవేటు నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలతో కుమ్మక్కు కావడం వల్లే పరీక్షలను తూ.తూ. మంత్రంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదొక అనధికారికంగాప్రశ్నపత్రాల లీకేజా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జనరల్ నర్సింగ్‌కు సంబంధించి సంవత్సర పరీక్షలు ఈ నెల 3వతేదీ నుంచి ప్రారంభమమ్మై 11 వతేదీ వరకు నిర్వహించనున్నారు. అయితే పరీక్షలు ఉదయం 9గంటలకు ప్రారంభమై 12గంటల వరకు నిర్వహించాలని షెడ్యూల్‌లో అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే రాష్ట్ర డైరెక్టర్ మిగతా 2లో


పరీక్ష కేంద్రాల్లో అనధికార వ్యక్తులు

### పండుగకు ముందే పట్టణాలకు కదులుతున్న

# వలసబండ్లు

- స్థానికంగా పనులు లేకపోవడంతో..!


వలస వెళ్లేందుకు ఆటోలలో బయలుదేరుతున్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** జిల్లాలో పశ్చిమ ప్రాంతం నుంచి ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ముందే వలస బండ్లు కదులుతున్నాయి. స్థానికంగా పనుల లేకపోవడంతోచేసేది లేకకూలీలు గత రెండువ నూడు రోజులుగా వసలబాట పట్టారు. కొన్ని రోజులుగా గోనెగండ్ల మండలం నుంచి వలసబండ్లు కదులుతున్నాయి. మంగళవారం పలు గ్రామాల నుంచి పట్టణాలకు కూలీలు వలసలు వెళ్లారు. గ్రామాల్లోని పంట పొలాల్లో పనులు లేక పోవడంతో కూలీలు బతుకుజీవుడా అంటు పొట్ట చేత పట్టుకొని పట్టణ ప్రాంతాలకు వలసలు వెలుతున్నారు. ఉగాది పండుగకు ఊరికి వస్తాం లేకపోతే వర్షలు కరిస్తే గ్రామాలకు వస్తాం అని చెబుతూ కూలీలు వలస బండ్లు ఎక్కి వెలుతున్నారు. స్థానికంగా కూలీ పనులు లేవు. భార్యపిల్లలు, తల్లి దండ్రులను పస్తులు ఉంచలేము. కావున గుంటూరు, హైదరాబాద్, మిగతా 2లో

### జిల్లా పరిషత్ ఆదాయం

# పెంచాం

- హక్కుగా రాబడిన నిధులపై ప్రత్యేక దృష్టి
- జడ్పీ ఛైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మెన్ పాపిరెడ్డి

**కర్నూలు ఎడ్యుకేషన్ ,మేజర్ న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా పరిషత్ ఆదాయం గతం కంటే ఈ మూడేళ్ల పాలనలో రెటింపు పెంచామనిజిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం తన ఛాంబర్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మిగతా 2లో

### కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి

# అన్నీ ఒకే చోటుకు..

- న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్,
- కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల జిల్లా కలెక్టర్, జేసి
- నంద్యాల మండల తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం


నంద్యాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

# నంద్యాలలో ప్రోటోకాల్ వివాదం


ఎమ్మెల్సీ ఇసాక్ బాష

- రూరల్ తహశీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీకి అందని ఆహ్వానం
- చివరికి స్వాగత బ్యానర్లలో కనిపించని ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ చిత్రాలు
- శాసన మండలి ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీ
- ఎమ్మెల్సీతో రెవెన్యూ వర్గాల చర్చలు విఫలం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రోటోకాల్ వివాదం దుమారాన్ని రేపుతోంది. నంద్యాల రూరల్ తహశీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ ఇసాక్ బాషకు పిలుపు అందలేదు. చివరికి కార్యాలయ ప్రారంభోత్సవ స్వాగత బ్యానర్లలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాష పోటోలు లేకపోవడంతో జిల్లాలో చర్చనీయంశంగా మారింది. ప్రోటోకాల్ అంశాన్ని ఎమ్మెల్సీ ఇసాక్ బాష శాసన మండలి ప్రివిలైజ్ కమిటీకిి ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్ వివాదంపై మిగతా 7లో

# నంద్యాల సబ్ రిజిస్ట్రార్ పై సస్పెన్షన్ వేటు

(మొదటి పేజి తరువాయి)

నంద్యాలకు వచ్చారు. ఆయన విధుల్లో చేరిన సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన స్వాగత వేడుకలు అప్పట్లో పెద్ద దుమారాన్ని రేపాయి. గ్రేడ్ -2 సబ్ రిజిస్టార్ అయిన అబ్దుల్ సత్తార్‌ను గ్రేడ్-1 సబ్ రిజిస్టార్‌గా నియమించడం ఒక అంశం అయితే నంద్యాల వాస్తవ్యుడుగా ముద్రపడి సత్తార్‌ను నంద్యాలలో నియమించడం ఆశాఖలో చర్చనీయంశంగా మారింది. తాజాగా ప్రొద్దుటూరుకు చెందిన కోనేటి కాల్వ వీధికి చెందిన సర్వేనంబర్ 483లోని ఒక స్థిర అస్థికి సంబంధించి డాక్యుమెంటు నంబర్ 15143-2024 ప్రొద్దుటూరు సెకండ్ ఆడిషనల్ డిస్ట్రిక్ కోర్టులో వివాదం నడుస్తుంది. ఇందుకు సంబందించి కోర్టు స్టే అర్డర్ ఉన్నట్లు ఆ శాఖ రికార్డుల్లో ఉంది. ఎనివేర్ రిజిస్ట్రేషన్ కింద ఆ స్థిర అస్తిని నంద్యాల సబ్ రిజిస్టార్ కార్యాలయంలో గత ఏడాది సెప్టెంబర్ 24న రిజిస్ట్రేషన్ చేశారు. అందులో బాధితుల్లోని ఒకరు ఆ శాఖ ఐజికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆ శాఖ డిఐజి కల్యాణి విచారణ జరిపారు. ప్రధానంగా కోర్టులో కేసు పెండింగ్ ఉన్న అస్థిని రిజిస్ట్రేషన్ చేయడంతో సబ్ రిజిస్టార్ అబ్దుల్ సత్తార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లోని ముఖ్యంగా సస్పెన్షన్ ఉన్నత వరకు హెడ్ క్వార్టర్స్ వదిలి బయటకువెళ్లరాదని పొందుపర్చడం సంచలనం రేపుతోంది. మొత్తం మీద నంద్యాలలో విధుల్లో చేరినప్పటి నుంచి అబ్దుల్ సత్తార్‌ను వివాదాలు చుట్టుముడుతూ వచ్చాయి. నంద్యాల సబ్ రిజిస్టార్ కార్యాలయం కేంద్రంగా పలు అంశాలకు సంబంధించిన ఆ శాఖ డిఐజిని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఒకటికి రెండు సార్లు కార్యాలయానికి పిలిపించి మాట్లాడిన విషయం సూర్య పాఠకులకు విధితమే. ఆ శాఖ డిఐజి నాలుగైదు సార్లు సబ్



నంద్యాల సబ్ రిజిస్టార్ కార్యాలయం

రిజిస్టార్‌ను కర్నూలుకు పిలిపించుకొని మందలించిన విషయం పాఠకులకు విధితమే. విధుల్లో చేరిన సమయంలో సబ్ రిజిస్టార్ కార్యాలయంలో స్టాంప్ రైటర్ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగడం ఒకటైతే నూతన హంగులతో తీర్చిదిద్దిన కార్యాలయ ప్రారంభోత్సవం సమయంలో ఒకటి, రెండు అంశాలు పెద్ద చర్చనీయంశంగా మారాయి. ప్రధానంగా కార్యాలయ ప్రారంభోత్సం మంత్రి ఫరూక్ చేతుల మీదుగా జరిగిన సమయంలో కార్యాలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో స్టాంప్ రైటర్లతో స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేయడంపై మంత్రి ఫరూక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ బ్యానర్లలో పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాంప్ రైటర్లు ప్రధాన ఆకర్షణ నిలవడంతో మంత్రి అసంతృప్తికి కారణం అయినట్లు ఆశాఖలో చర్చ జరిగింది. మొత్తం మీద వివాదాస్పదుడుగా ముద్ర పడిన నంద్యాల సబ్ రిజిస్టార్ -1 అబ్దుల్ సత్తార్ పై సస్పెన్షన్ వేటు పడటం ఆ శాఖను కుదిపేస్తోంది.

# జిల్లా పరిషత్ ఆదాయం పెంచాం

(మొదటి పేజి తరువాయి)

అందరి సహకారంతో ఉన్నతమైన ఆలోచన, ఆచరణతో మూడేళ్ళ పాలన విజయవంతంగా సాధ్యమైందన్నారు. 2019- 2020 లో జడ్పీ ఆదాయం రూ.5 కోట్ల నుంచి 6 కోట్ల వరకే ఉండేదని, ప్రస్తుతం 2024-2025 నాటికి రూ.11.44 కోట్లకు పెంచామని తెలిపారు. జిల్లా పరిషత్ కు హక్కుగా రాబడే ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించి ఆదాయం పెంచుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జడ్పీ ముఖద్వారంగా ఉన్న హెూల్డింగ్లకు గతంలో స్క్వేర్ ఫీట్ కు రూ. 36 నుంచి ప్రస్తుతము 192 రూపాయలకు పెంచామని, భవిష్యత్తులో వీటిని మరింత పెంచి ఆదాయం చేకూరుస్తున్నట్లు చెప్పారు.చారిత్రాత్మక కట్టడమైన జడ్పీ పాత భవనంను ఏపీ టూరిజం హెూటల్ నిర్వహణకు స్క్వేర్ ఫీట్ 15 రూపాయలు చొప్పున,కాళీ స్థలంను 7 రూపాయలకు ధర నిర్ణయించి అద్దెకిచ్చేందుకు జడ్పీ సమావేశాలలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎమ్మిగనూరులో షాపింగ్ కాంప్లెక్స్ నుంచి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే 60 సి.పి.డబ్ల్యు.ఎస్ పథకాల ద్వారా కర్నూలు- నంద్యాల జిల్లాలలో 663 హ్యాబిటేషన్లకు సురక్షితమైన త్రాగునీరు అందించమన్నారు.వీటి నిర్వహణకై 15 ఆర్థిక సంఘం నిధులు వినియోగించమన్నారు.గడచిన మూడు సంవత్సరాల కాలములో 99 పనులు చేపట్టి 72 పనులు రూ. 4,11, 46,528/-ల ఖర్చుతో పూర్తిచేశామని తెలిపారు. అలాగే జెడ్పి ఆవరణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూడా ఆలోచనను చేస్తున్నామని, కొన్ని చిన్న సమస్యలు ఉన్నాయి అవి తిరితే అందరి సహాయ సహకారాలు అందిస్తే త్వరలో నిర్మాణం చేసేలా చూస్తామన్నారు. 2024 జూన్ వరకు జడ్పీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించామని, జడ్పీటీసి సభ్యుల గౌరవేతనాలను రూ. 29 లక్షల,39 వేలు చెల్లించామన్నారు. ఇంకా రూ 7.86 కోట్లు జనరల్ ఫండ్ పెండింగ్లో ఉన్నట్లు వివరించారు. వీటి కోసం డ్యాప్యూటీసీఎం, పంచాయతీ రాజ్ కమిషనర్కు లెటర్ పంపామన్నారు. జిల్లా పరిషత్ జనరల్ బాడీ, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు చెపిన సమస్యల పైన సంబంధిత అధికారులతో సమగ్ర నివేదికల అందజేస్తున్నామన్నారు. కీలక శాఖలైన ఆర్డబ్ల్యూఎస్, వ్యవసాయము, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై నిర్దిష్టంగా చర్చించి, పనుల పురోగతి సాధిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు.ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, జెడ్పిటిసిలు అధికారులు మీడియా మిత్రులు అందరి సహకారం ఇలాగే అందించాలని సవినయంగాకోరుతున్నామని తెలిపారు.గూడూరు జెడ్పిటిసి మౌలాలి,జూపాడుబంగ్లా జెడ్పిటిసి జగదీశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ధి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగాలి

- ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు



**కర్నూలు కల్చలర్, మేజర్‌న్యూస్:** నగరంలోని శ్రీరామాలయం పేటలో వెలసిన శ్రీ సీతారామచంద్రుల స్వాముల వారి శతాబ్ది బ్రహోత్సవాలు ఘనంగా జరగాలని ఉడిపి పెజావర్ పీఠాధిపధి విశ్వప్రసన్న తీర్థులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వప్రసన్న తీర్థులు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 18వతేదీ వరకు సప్తరాత్రి శతాబ్ది బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 16న శ్రీసీతారాముల కళ్యాణోత్సవం, సాయంకాలం దివ్య మంగళ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాళిగి వ్యాసరాజ్, సందడి మహేష్, మాళిగి భానుప్రకాష్, చిల్కూరు ప్రభాకర్, విఠల్‌శెట్టి, విఠల్‌రావు, చంద్రకాంత్, జయతీర్థ, వేదవ్యాస్, సత్యప్రియ, నీలినరసింహ పాల్గొన్నారు.

## ప్రజా సేవకై వైద్యులు అందుబాటులో ఉండాలి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి ప్రజా సేవలు చేయాలని మండల ఎంపీపీ బుడ్డారెడ్డి యశ్వశిని పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలోని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో కాన్పు అయిన మహిళను పరిశీలించి ఆమెకు రూ. 2 వేలు ఖర్చుల నిమిత్తం అందజేశారు. డాక్టర్ భగవాన్‌దాస్, డాక్టర్ వెంకటరెడ్డి, ఎంపీహెచ్ఈవో హుసేన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పండుగకు ముందే పట్టణాలకు కదులుతున్న వలసబండ్లు

(మొదటి పేజి తరువాయి)

రాజంపేట ప్రాంతాలకు వలస పోతున్నాం అంటు గోనెగండ్ల మండలం నుంచి ప్రతి గ్రామం నుంచి వం దలాది మంది కూలీలు వలస బాట పట్టారు. పలుగ్రామాలకు చెందిన కూలీలు ఆటోల, ట్రాలీ ఆటోలలో బతుకు జీవుడా అంటు భార్యపిల్లలతో కలసి బయలు దేరుతున్నారు. వలస వెలుతున్న కూలీలను ఆంధ్రజ్యోతి పలకరించింది. గ్రామాల్లోని పొలాలలో పనులు అయిపోయాయి ఇక పనులు లేవు దీనికి తోడు గ్రామాల్లో అధికారులు సైతం ఉపాధి పనులు కల్పించడంలేదు. అరకొర పనులు కల్పించినప్పటికి కూలీ డబ్బులు గిట్టుబాటు కాకపోవడం. అవికూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఇక గ్రామాల్లో లాభంలేదని వలసలు వెల తున్నామని తెలిపారు. వేముగోడు గ్రామంతో పాటు గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు. పెద్దనేలటూరు, కులుమాల, బైలుప్పల, ఆగ్రహారం, గంజహళ్లి గ్రామాలతో పాటు మం డలంలోని అన్ని గ్రామాల నుంచి వలసలు వెలుతున్నారు. చాల గ్రామాల్లో బీసీ, ఎస్సీ కాలనీల్లో ఎక్కువ మంది వలసబాట పట్టారు. దీంతో గ్రామాల్లో వీదులు నిర్మాణుష్యంగా మారాయి. కూలీల ఇండ్లకు తాళలు వేసి వెళ్లారు.

# ప్రహసనంగా జిఎన్‌ఎం పరీక్షలు

(మొదటి పేజి తరువాయి)

ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి పరీక్ష పత్రం ఉదయం 9గంటలకు వస్తుంది. వెంటనే ప్రశ్నపత్రాలను ప్రింటింగ్ చేసి విద్యార్థులకు అందిం చాల్సిన అధికారులు కాలయాపన చేస్తూ 45నిమిషాలు ఆలస్యంగా విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందిస్తున్నారు. అయితే ప్రింటింగ్ తీసిన అనంతరం ప్రశ్నపత్రాలను కొన్ని కళాశాలల యాజమాన్యాలకు అంద జేస్తున్నట్లు దీంతో పరీక్షల్లో పారదర్శకత లోపిస్తుందని పలువురు విద్యా ర్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు సిబ్బంది కో-ఆర్డినేషన్ విధుల పేరుతో పరీక్ష కేంద్రాల్లోనే తిరుగుతూ మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహి స్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ప్రశ్నపత్రం ఆలస్యంగా ఇస్తున్నందుకు పరీక్షల్లో విద్యార్థులు సమయం కేటాయిస్తున్నామని అధికారులు సర్దిచెబుతున్నప్పటికీ జీఎన్‌ఎం పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం లేదన్న విమర్శలు భారీగా వస్తున్నాయి.

**జీజీహెచ్ సూపరింటెండ్ ఏమన్నారంటే..! :** జనరల్ నర్సింగ్ పరీక్షల నిర్వహణ ఆలస్యం, పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది తీరుపై మేజర్‌న్యూస్ ప్రతినిధి వివరణ కోరగా.. జీఎన్‌ఎం పరీక్షలు ఆలస్యంగా జరుగుతున్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. డీఎంఈ కార్యాలయం నుంచి తమకు ప్రశ్నపత్రాలు తమకు 9గంటలకు పాస్‌వర్డు వస్తుందని, తాము వాటిని ప్రింట్ అవుట్ తీసి విద్యార్థులకు అందజేయడానికి సమయం పడుతుందని, సర్దిచెప్పుకున్నారు. ఇందుకుగాను విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా మరో అరగంట సమయం పరీక్షలకు కేటాయిస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది కో-ఆర్డినేషన్ పేరుతో ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారన్న విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. తాను స్వయంగా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తానని తెలిపారు.

## కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అన్నీ ఒకే చోటుకు..



మొక్కలను నాటుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జనాభా ప్రాతిపదికన మేరకు నంద్యాల అర్బన్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సత్వర రెవెన్యూ సర్వీసుల సౌలభ్యం కొరకు రెండు భాగాలుగా విభజించి రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటైన రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం జిల్లా కేంద్రమైన తరువాత జనాభా అధికమైన నేపథ్యంలో రూరల్, అర్బన్ మండలాలుగా విభజించి ప్రజలకు రెవెన్యూ సర్వీసులను సరళీతరం చేసేందుకు రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గతంలో నంద్యాల పట్టణ కేంద్రంలో అనేక మంది మేధావులు, అధికారులు పనిచేసి అభివృద్ధి చేశారన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకుని వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాయలసీమ జిల్లాలో నంద్యాల జిల్లాకు మంచి పేరు ఉందని ప్రజలు, అధికారులు సహకరించి జిల్లాను అభివృద్ధి చేయాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని భూ సంబంధిత దరఖాస్తులు, ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో నంద్యాల రూరల్ మండల ఏర్పాటుకు నిమిత్తం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈమేరకు మంత్రి చేతుల మీదుగా నంద్యాల అర్బన్ తహశీల్దార్ కార్యాలయ భవన ప్రాంగణంలోనే రూరల్ మండల కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. రూరల్ మండల కార్యాలయ పరిధిలో 13 రెవెన్యూ గ్రామాలు వస్తాయన్నారు. మండల పరిధిలోని సచివాలయాలను కూడా అనుసంధానం చేసి అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించేందుకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కార్యాలయ ఆవరణంలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులను శిక్షించాలి

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్:** కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులను శిక్షించాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ రామకొండ వెంకటేశు, జిల్లా అధ్యక్షుడు పులికొండ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పట్టణంలో ఎమ్మార్పిఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మాదాసి, మాదారి కురువలను అని తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్స్ చేయించుకున్నారన్నారు. ఎస్సీ కుల మాదిగలపై దుష్ప్రచారం నాయకులను భరతం పడతామని హెచ్చరించారు.జిల్లా ఎమ్మార్పిఎస్ నాయకులు బొంతల నరసింహులు మాదిగ, హోసూరు కాళ్ల రంగస్వామి మాదిగ, రాంకొండ రామ్‌లక్ష్మణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం... ప్రమాదాలను నివారిద్దాం

- యువత వల్లే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం
- ప్రమాదాలపై లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థుల అవగాహన



రోడ్డు ప్రమాదం గురించి అవగాహన కల్పిస్తున్న విద్యార్థుల దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** సమాజంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదంలో నివారించాలని, యువతల్లో వచ్చే మార్పులతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని పట్టణ ఎస్సై డాక్టర్ నాయక్, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజులు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ మనీ మాధురి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదలపై విద్యార్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్ ప్రధాన రహదారులు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించకుండా జరిగే ప్రమాదాల గురించి విద్యార్థులు ద్వారా అవగాహన సదస్సు ద్వారా ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోయే వారిలో ఎక్కువమంది యువతే ఉన్నారన్నారు. యువత ప్రమాదాల బారి నపడి తల్లిదండ్రులకు గుండె కోత మిగిల్చారాదన్నారు. ప్రాణం ఎంతో విలువైందని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో మరణించకూడదని ఉద్దేశంతో ఇలాంటి అవగాహన సదస్సు ద్వారా కృషి చేయడం అభినందనీయమన్నారు. నేటి యువత వేగానికిచ్చిన విలువ ప్రాణాలకు, హెల్మెట్ ధరించేందుకు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. యుక్త వయసు వచ్చేవరకు వారికి రోడ్ సేఫ్టీ పై పూర్తిగా అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమంలో ముందుండాలన్నారు. లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు చేపట్టిన అవగాహన సదస్సులో పలువురు ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ప్లానెట్ స్కూలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రెవెన్యూ సదస్సు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి రెహమాన్ తహసిల్దార్

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** బండి ఆత్మకూరు మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. ఇప్పటివరకు జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల ద్వారా 91 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించామని మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రెహమాన్ తహసిల్దారు పద్మావతి తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం ఆఖరి రోజున బి కోడూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ రైతుల నుండి వచ్చిన దరఖాస్తులకు రెవిన్యూ అధికారులు పరిష్కార మార్గం చూపుతారని అన్నారు. భూ సమస్యలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతు సంక్షేమం కొరకు కృషి చేస్తుందని అన్నారు. గతంలో అధికారులు రీ సర్వేలో ఇచ్చిన దరఖాస్తులకు కొన్నిటికి మాత్రమే పరిష్కారం లభించిందని మిగిలిన సమస్యలకు కూడా పరిష్కరిస్తామని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. రైతులు అందించిన దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపుతామని తాసిల్దార్ పద్మావతి రైతులకు హామీ ఇచ్చారు. సమావేశంలో మండల సర్వేయర్ షాహిన్ పర్వీన్, వి ఆర్ ఓ ఆదిశేషయ్య ,పంచాయతీ సెక్రెటరీ జ్యోతి , పలువురు రైతులు పాల్గొన్నారు.

# మొలగవల్లిలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ఆలూరు, మేజర్ న్యూస్ :** ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామం లో మారెమ్మ అవ్వ దేవాలయం నుండి కోమటి నాగయ్య ఇంటి వరకు 20 లక్షల రూపాయలు తో వేస్తున్న సిసి రోడ్లను ఏ.ఈ చౌడారెడ్డి, కాంట్రాక్టర్ ఈరప్పలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో టీడీపి ప్రభుత్వం ఇచ్చిన నిధులతో 90 శాతం రోడ్లు పూర్తి అయ్యాయని అందులో భాగంగా మొలగవల్లి కి 20 లక్షలు వచ్చాయని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ మోహన్ రాజ్,అశోక్ యాదవ్,అంజినయ్య, గోపాల్,రామ కృష్ణ,శీనప్ప,మోకా మల్లయ్య,నాగరాజు, ప్రకాష్, కిష్టప్ప,బంగారి గోపాల్, జలందర్,ఐకాంత్, మాల అంజునయ్య,హంపన్న లు పాల్గొన్నారు.

# అర్హులైన కౌలు రైతుకి రుణ సదుపాయం




పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు

**బండి ఆత్మకూరు రూరల్,మేజర్ న్యూస్ :** అర్హులైన ప్రతి ఒక్క కౌలు రైతుకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని ఏ కోడూరు బ్యాంక్ మేనేజర్ నాగరాజు తెలిపారు. మంగళ వారం ఏ కోడూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికా రిని స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోలం పిలుస్తుంది కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ అర్హులైన రైతుల తోపాటు, కౌలు రైతులకు కూడా రుణ సదుపాయం కల్పిస్తు న్నామన్నారు. అర్హులైన రైతులు వారి వివరాలను బ్యాంకు అధికారులకు సమర్పించాలని , అర్హత పరిశీలించి రుణం మంజూ రు చేస్తామని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిని స్వాతి మాట్లాడుతూ రబీ పంట క్రాప్ ఇన్సూరెన్స్ ఈనెల 15వ తేదీ వరకు చెల్లించవచ్చని రైతులు అవకాశాన్ని విని యోగించుకోవాలని కోరారు. ఈ పంట నమోదును తప్పని సరిగా చేసుకోవాలని రైతులకు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా లోకనాథ్



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ రెగ్యులర్ కార్యదర్శిగా కే .లక్ష్మీ నాథ్ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీ వో సుహాసిన మ్మ ను మర్యాదపూర్వకంగా కలిసి తన పదవి బాధ్యతలు స్వీకరిం చారు. ఈయన సి.బెళగల్ మండలం నుండి వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం ,నీటి సమస్య, వీధిలైట్లు సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే మూడు గ్రామ సచివాలయా ఉద్యోగులు కార్యదర్శులు సహకరించి పనులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# జాతీయ సేపక్ తక్రా పోటీలకు ఆలూరు క్రీడాకారులు



జాతీయ సేపక్ తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు నియోజకవర్గం నుండి జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు వెళ్లే అభ్యర్థులకు ఆలూరులో కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు డీఎస్ డిఓ భూపతిరావు తెలిపారు. పది రోజులపాటు జరుగుతున్న ఈ క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను డీఎస్ డి ఓ భూపతిరావు పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కు మంచి గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.డి.కవిరాజ్ సులోచన చినబాబు పాల్గొన్నారు

# అద్దె చెల్లించకపోతే షాపులు సీజ్ చేస్తాం : డీఎస్ఓ



షాపులను తనిఖీ చేస్తున్న డీఎస్ఓ భూపతిరావు.

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు ప్రభుత్వ కాలేజ్ అవరణంలోని ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న 6 షాపులు అద్దె బకాయిలు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేస్తామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ భూపతి రావు అన్నారు. మంగళ వారం స్థానిక స్పోర్ట్స్ దుకాణాల సముదాయ వ్యాపారస్తుల తో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 6 దుకాణాల కు సంబంధించి రూ. 10 లక్షల వరకు అద్దె రావల్సి ఉందన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దుకాణదారులకు అద్దె చెల్లించాలని హెచ్చరించినట్లు వారు చెప్పారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ లలో మూడు, నాలుగేళ్ల నుండి అద్దె చెల్లించకుండా షాప్ లు నడిపించుకుంటున్నారని దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని అన్నారు.ఇండోర్ స్టేడియం నిర్వహణకు అన్ని విధాల ప్రభుత్వం సొంత ఖర్చులతో నడుపుతుందని ఈ మార్చి లోపు మొత్తం అద్దె చెల్లించకుంటే దుకాణాలను సీజ్ చేసి కొత్తగా టెండర్ పాడుతామని అన్నారు.కావున వ్యాపారవేత్తలు అద్దెలను సకాలంలో చెల్లించాలని తెలిపారు.

# బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌ను కలిసిన మాన్విదేవేంద్రప్ప, రామక్రిష్ణ



చర్చిస్తున్న మాన్విదేవేంద్రప్ప, రామక్రిష

**కర్నూలు రూరల్, మేజర్ న్యూస్:** బీసీ వెల్ఫేర్ కార్పొరేటర్ డైరెక్టర్ ఎండి.మల్లికార్జునను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కురుమ, కురువ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర డైరెక్టర్ కె.రామక్రిష్ణ విజయవాడలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భగా కురుమ కులస్తులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టాల్సిన పథకాల గురించి చర్చించారు. కురుబ కులస్తులకు కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాల గురించి అధ్యయనం చేయాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కురుబ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం




ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**కర్నూలు లీగల్, మేజర్ న్యూస్:** గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయవాదికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి, శాశ్వత లోక్అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్ అన్నారు. మంగళవారం నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరైన పలు చట్టాలపై అవగాహన కల్పించారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే సమాచారం అందించాలన్నారు. అనంతరం శిశు లింగ నిర్ధారణ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.శాంతికళ, సుమలత, కేవీఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవికరాణి, ఎన్‌జీవో డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, డిప్యూటీ మెడికల అండ్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హిలకుమారి పాల్గొన్నారు.

## పాఠశాలకు వెళ్లాలంటే..

# ఎల్లెల్సీ కాలువ దాటూల్సిందే..!

- కాలుజారితే కాలువలోకే..
- గోనెగండ్ల బీసీ హాస్టల్ విద్యార్థినీల ఇబ్బందులు



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ : :** మండల కేంద్రమైన గోనెగండ్ల లోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినిల రాక పోకలు కాలువపై వేసిన మట్టి కట్ట పై సాగడంతో ఇబ్బందిగా మారింది. దీంతో విద్యార్థినిలు కాలువ పై వేసిన మట్టి కట్ట దాటేవరకు జాగ్రత్తగా నిదానంగా నడవాల్సి వస్తుంది. ఇక అజాగ్రత్తతో కాలుజారితో ఇక నేరుగా ఎల్లెల్సీ కాలువ లోనే పడాల్సి వస్తుంది. దీంతో పిల్లలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల లోని బీసీ బాలికల హాస్టల్ గంజహళ్లి రోడ్డు లో చివరకు ఉంది. హాస్టల్ లో దాదాపు 250 మంది విద్యార్థినీలు ఉన్నారు. వీర అందరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యసిస్తున్నారు. వీరు ప్రతి రోజు పాఠశాలకు వెళ్లాలంటే దారి మధ్యంలో ఉన్న ఎల్లెల్సీ కాలువ ను దాటి వెళ్లాల్సి ఉంది. దీంతో అధికారులు పిల్లలు పాఠశాలకు వెళ్లేందకు గాను కాలువ పైన మట్ట కట్టను ఏర్పాటు చేశారు. అయితే వేసిన మట్టి కట్ట సరిగా లేక పోవడం కాలువలోని నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకో పోవడంతో వ ట్టి కట్ట కాస్తా చిన్నదిగా మారిపోయింది. దీంతో విద్యార్థినీలు స్కూల్ కు వెళ్లివచ్చే టప్పుడు జాగ్రత్తగా వెళ్లి రావాల్సి ఉంది. ఏమాత్రం ఆజాగ్రత్తగా ఉన్నా కాలు జారి కాలువలో పడాల్సిందే. ఇక వర్షం కురిస్తే ఇక విద్యార్థులు వెళ్లి రావడానికి వారు పడాల్సిన పాట్లు అన్ని ఇన్ని కావు. కావున ఇప్పటి కైన అధికారులు స్పందించి పిల్లల రాక పోకలకు శాశ్విత బ్రిడ్జిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు..

# నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయండి

**– డీఎల్‌పీవో వీరభద్రప్ప**

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండలంలోని జొన్నగిరి, రాతన, పగిడిరాయి, సూర్యతాండ గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్మాణ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి గ్రామంలోనే సంపద సృష్టించే విధంగా వనరులను గుర్తించాలన్నారు. అంతేకాక ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా ఖర్చు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి ఏయాలన్నారు. అనంతరం జొన్నగిరి గ్రామలంఓ నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ శ్రీహరి, సర్పంచులు ఓబులేసు, బోడిబండ హనుమంతు, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, రాజునాయక్, శివ, మనోహర్, దేవేంద్రనాయక్, నాగేంద్ర ఉన్నారు.



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కిందింటి తిక్కయ్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈవిషయాన్ని తెలుసుకున్న టిడిపి యువనాయకులు ఉప్పలపాటి అర్జున్ తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి సమాచారం ఇవ్వడం జరిగిందని ఉప్పలపాటి అర్జున్ తెలిపారు. దీనితో ఆయన సహకారంతో తిక్కయ్య అంత్యక్రియలకు 5వేల రూపాయలు అర్థికసహాయంను ఉప్పలపాటి అర్జున్ మృతుని కుటుంబానికి అందజేశారు. అలాగే చంద్రన్నభీమా టిడిపి సభ్యత్వం నుండి కూడా ఆర్థికసహాయం అందించేందుకు టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కృషిచేస్తారని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వంద గల్లు నరసింహులు, ఆంజినేయులు, రాయచూరు రామకృష్ణ పాల్గొన్నారు.



## బ్యాంక్ ఉద్యోగాల్లో సత్తా చాటిన శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్




ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులతో కోచింగ్ చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా కేంద్రంలో శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ మరోసారి రాష్ట్రస్థాయిలో తన సత్తాను చాటింది. గ్రామీణ బ్యాంకు రంగంలో 272 ఉద్యోగాల్లో సాధించి అగ్రగామిగా నిలిచినట్లు శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ మౌలాలిరెడ్డి వెల్లడించారు. ఈసందర్భంగా సక్సెస్‌మీట్ నిర్వహించారు. గ్రామీణ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024 గ్రామీణ బ్యాంకుల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తమ బ్యాంక్ కోచింగ్ సెంటర్ నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారు అత్యుత్తమ శిక్షణతో ఉద్యోగాలు సాధించారన్నారు. 272మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బి పీఓలో 151, ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బి క్లర్క్‌లో 121మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. సరళమైన భాషలో బోధిస్తూ ఉద్యోగాలు పొందేలా చూడడమే తమ లక్ష్యమన్నారు.

## కార్మికుడు మృతి..

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ ::** మండల పరిధిలోని రత్న పల్లి గ్రామ సమీపంలో ఓ ఇటుకల బట్టి లో పనిచేసే వ్యక్తి దుర్జన్ 48 ఇటుకల బట్టి కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఒడిస్సా కు చెందిన ఈ కార్మికుడు నెల రోజుల క్రితం ఇటుకల తయారీ పరిశ్రమ లో కూలి పనికి చేరాడు, మంగళవారం ఇతను కనిపించక పోవడంతో తోటి ఇటుకల కార్మికులు గాలింపు చర్య చేపట్టారు. ఇటుకల బట్టి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్న అతని మృతదేహాన్ని తోటి కూలీలు గుర్తించారు. దుర్జాన్ మృతి చెందాడన్న విషయాన్ని ఒడిస్సా లో ఉన్న వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని కుటుంబీకులు వచ్చేవరకు వెల్దుర్తి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మృతదేహాన్ని ఉంచారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



ఇటుకల బట్టి కార్మికుడు దుర్జాన్

## టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్:** టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని టీడీపీ నాయకులు మిక్కిలినేని శ్రీనివాసరావు,కోడాలి వేణుగోపాల్ అన్నారు.మండల పరిధిలోని హొన్నూర్ క్యాంప్ గ్రామం లో ఎన్‌ఆర్‌జిఎస్ గ్రాంట్ కింద రూ.5 లక్షలను నిధులతో డ్రైనేజీ,సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి రోడ్లు ఉన్న కాలనిలో ప్రభుత్వం నిధులను సమకూర్చి సీసీ రోడ్లు నిర్మిస్తుందన్నారు. దింతో గ్రామాలు అన్ని విధాలుగా భాగు పడుతున్నాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చెయదంతో ముందు ఉండని ప్రభుత్వానికి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



హొన్నూర్ క్యాంప్ గ్రామంలో సీసీ రోడ్డును నిర్మిస్తున్న టీడీపీ నాయకులు

## పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలి

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నునసారాళ్ల గ్రామా నికి చెందినకురువ గొడుగు వీరేష్ అనే రైతు పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ 2017లో తమ తాత కురువ గొడుగు రామన్న ద్వారా బొందిమడు గుల రెవెన్యూ గ్రామంలో 60సర్వేనెంబర్‌లో 5ఎకరాల 80సెంట్ల వ్యవసాయ భూమిని దానవిక్రయం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. అయితే ఆదోని పట్టణానికి చెందిన కురువ గొడుగు లింగప్ప అనే వ్యక్తి తనకు పట్టాదారు పాస్‌బుక్ రాకుండ అడ్డుపడుతున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ కె.రమాదేవి మాట్లాడుతూ రైతు కురువ గొడుగు వీరేష్ సమస్యపై చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## ఉపాధి హామీ పథకంలో మేటీల వ్యవస్థలను బలోపేతం చేయాలి

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** ఉపాధి హామీ పథకంలో మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను బలోపేతం చేయాలని గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, అడిషన్ కమిషనర్ శివప్రసాద్ తెలిపినట్లు ఏపీవో హేమసుందర్ తెలిపారు. మంగళవారం మండలపరిషత్ సమావేశ భవనంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంటు, మేటీలతో గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో హేమసుందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులను ఎలా కల్పించాలని, విధి విధానాలను కమిషనర్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ ప్రదీప్, టెక్నికల్ అసిస్టెంట్లు రామక్రిష్ణ, పదిరప్ప, చంద్రశేఖర్, జయరాముడు, జీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏపీవో హేమసుందర్

## 13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహణ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** జిల్లాలో మంగళవారం 13గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని టీఎస్‌కుల్లూరు 06, కోసిగిలో13, కామవరంలో 24, పగరూరు గ్రామంలో 3, పెద్దకడుబూరులో 18, జి.హొసలి గ్రామంలో 12, గనేకల్లులో 6, పెద్దగోనేహాల్‌లో 13, పెండేకల్లులో 4, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని తడకనపల్లిలో 8, సుంకేసులలో 7, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పెద్దహోతూరులో 5, ముత్తుకూరులో 3 మొత్తం 13గ్రామాల్లో 122దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించిన ఆయా గ్రామాల్లో మొత్తం ఇప్పటి వరకు 7,698అర్జీలను అధికారులు స్వీకరించారు.

# ప్రతి పోలీస్ అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పి

- ఇజ్‌తెమా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పి
- అవాంఛనీయ సంఘటనలు జరుకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ముస్లీం సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించుకుంటున్న ఇజ్‌తెమా కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రతి పోలీస్ అప్రమత్తంగా ఉండి పటిష్టమైన భద్రతను అందించాలని నంద్యాల జిల్లా ఎస్పి అధిరాజ్‌సింగ్ రాణ అన్నారు. మంగళవారం పట్టణ శివార్లలో ఏర్పాటు చేసిన ఇజ్‌తెఆ ప్రాంతాన్ని సందర్శించి భద్రత ఏర్పాట్లును ఎస్పి పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, కంట్రోల్‌రూము, సభాస్థలి తదితర ప్రాంతాలను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా ఆత్మకూరు పట్టణంలో ఇజ్‌తెమా జరగడం సంతోషకరమని అన్నారు. మూడు రోజులు జరిగే ఇజ్‌తెమాకు అధిక సంఖ్యలో ముస్లీం సోదరులు ఇతర ప్రాంతాల నుంచి హాజరవుతారని, వారిని దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తగినంత పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భద్రత ఏర్పాట్ల పోలీసు అధికారులకు దిశానిర్ధేశం చేశామన్నారు. మూడు రోజులు జరిగే ఇజ్‌తెమా కార్యక్రమంలో శాంతిభద్రలకు భంగం కలగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు ప్రతి చిన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయకుండా అధికారులకు సమాచారం ఇస్తు శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఎస్పి వెంట ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, సిఐలు సురేష్ కుమార్ రెడ్డి, రాము, ఇజ్‌తెమా నిర్వాహకులు ఉన్నారు.

# మాక్స్ నిబంధనల మేరకే ఎన్నికలు

- ఆ రెండు సొసైటీ ఎన్నికల్లో అక్రమాలకు తావు లేదు
- మాచినేపల్లె- నగళ్లపాడు అధ్యక్షులు ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి



విజయడైరీ ఛైర్మెన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)



నగ ళ్లపాడు అధ్యక్షులు గంగుల విజయసింహారెడ్డి (ఫైల్‌ఫోటో)

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** మాక్స్ చట్ట పరిధిలోనే రుద్రవరం మండలం మాచినేనిపల్లె, చాగలమర్రి మండలం నగళ్లపాడు పాల ఉత్పత్తిదారుల సొసైటీల ఎన్నికలు జరిగాయని అయా సొసైటీల అధ్యక్షులు మరియు విజయడైరీ ఛైర్మెన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి తెలిపారు. అక్రమాలకు తావు లేకుండా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికలు వాయిదా వేసినట్లు ప్రకటించి మరోమార్గంలో తాము ఎన్నికైనట్లు అధికారపార్టీ నేతలు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. కాల పరిమితి తీరిన సొసైటీలకు ఎలా జరిగాయో మాచినేనిపల్లె, నగళ్లపాడు సొసైటీకీ ఎన్నికలు అలాగే జరిగాయన్నారు. ఇద్దరు అధ్యక్షులు మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ చాగలమర్రి మండలం చక్రవర్తుపల్లె పాల ఉత్పత్తిదారుల సొసైటీ సభ్యత్వం రద్దుకు పై రెండు సొసైటీల ఎన్నికలకు సంబంధం లేదన్నారు. చక్రవర్తుపల్లె సొసైటీ ఎన్నికల వివాదాస్పద అన్న అంశాన్ని ప్రక్కదారి పట్టించేందుకు మాచినేనిపల్లె, నగళ్లపాడు ఎన్నికలు అక్రమంటూ అధికార పార్టీ నేతలు ప్రచారానికి తెరలేపారన్నారు. చక్రవర్తుపల్లె సొసైటీ అధ్యక్షులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అధ్యక్షులు కాకముందే ఆళ్లగడ్డ జగత్ డైరీ వర్కింగ్ పార్టనర్‌గా విజయ డైరీద్వారా రూ.1.30 కోట్లు రుణం తీసుకొని ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఇది ఒక అంశం అయితే జగత్ డైరీలో వర్కింగ్ పార్టనర్‌గా ఉంటూ చక్రవర్తులపల్లె సొసైటీ ఎన్నికల్లో పాల్గొన కూడదన్నారు. ఒక పాల వ్యాపారి అదే వ్యాపారం కలిగిన విజయడైరీలో సభ్యాత్వానికి అనర్హుడన్నారు. తీసుకున్న రుణం చెల్లించమని పలు మార్లు విజయడైరీ కోరినా చెల్లించలేదన్నారు. విజయ డైరీ నిధులను తీసుకొని దుర్వినియోగం చే శారన్నారు. 2014 ఉంచి 2020 వరకు జగత్ డైరీని విజయ డైరిని సమానంగా నడిపారన్నారు. ఆ సమయంలో విజయ డైరీ సంస్థ నష్టానికి పరోక్షంగా జగత్ విఖ్యాత్‌రెడ్డి కారణమయ్యారన్నారు. విజయ డైరీ నుంచి తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో పాటు విజయ డైరీ పాల వ్యాపారానికి సమాంతరమైన జగత్ డైరీలో వర్కింగ్ పార్టనర్‌గా ఉండటంతో చక్రవర్తుపల్లె సొసైటీ సభ్యత్వాన్ని రద్దు చేశామన్నారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే నగళ్లపాడు, మాచినేనిపల్లె ఎన్నికలు దొంగదారిలో ఎవరికీ చెప్పకుండా అధ్యక్షులను ఎన్నుకున్నారని ఆరోపించడం సరైందికాదన్నారు. ఇకపోతే మాచినేనిపల్లె ఎన్నిక అక్రమమంటూ తౌకల వెంకటేశ్వర్లు గౌరవ హైకోర్టును ఆశ్రయించారని, అప్పట్లో కో ఆపరేటివ్ యాక్ట్ ప్రకారం ఆ సొసైటీలో కూర్చొని మాట్లాడుకోవాలని కేసును కొట్టివేసిందన్నారు.

# పది పరీక్షా ఫలితాల్లో జిల్లాను టాప్ -10లో నిలపాలి

- డీఈవో జనార్ధన్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న డీఈవో

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మార్చి నెలలో జరగబోయే పదవ తరగతి పబ్లీక్ పరీక్ష ఫలితాల్లో జిల్లాను టాప్ -10లో నిలపాలని డీఈవో జనార్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. బోడెమ్మనూరు జడ్పీహైస్కూల్, ఉయ్యాలవాడ ఏపీ మోడల్ స్కూళ్ళను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఫలితాల్లో మన జిల్లా రాష్ట్రంలో 19వ స్థానంలో ఉందని అన్నారు. మార్చిలో జరగబోయే పరీక్షల కోసం 131 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 25531 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. బోడెమ్మనూరు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి స్కూల్‌కు బస్సు ఉండటాన్ని ఆశ్చర్యపోయారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా స్థానిక బర్డ్స్ స్వచ్చంద సంస్థ వారు ఈ పాఠశాలకు స్కూల్ బస్‌ను విరాళంగా ఇచ్చి విద్యార్థుల అభ్యున్నతిని తోడ్పడటం ఎంతో అభినందనీయమని అన్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సంస్థ ప్రతినిధులు ఆదినారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డిలను అభినందించారు. వీరితో పాటు పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్యతో కలిసి స్కూల్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు చేసిన రింగ్ డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. ఈ పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు, ఉయ్యాలవాడ ఏపీ మోడల్స్ స్కూల్ నుంచి 21 మంది విద్యార్థులు నంద్యాల జిల్లా కేంద్రంలో జరగబోయే రిపబ్లీక్ వేడుకల్లో పాల్గొంటారని అన్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు తప్పని సరిగా స్టడీ హవర్స్ నిర్వహించాలని సూచించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని, మౌళిక వసతులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 వీరప్రతాప్‌రెడ్డి, పీఆర్‌టీయు నాయకులు పోచా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు దక్షణామూర్తి, విక్రనారాయణాచారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, మహాబూబ్‌పీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేవర ఉత్సవాలు ప్రారంభం

- రెండురోజులపాటు ఉత్సవాలు - భారీ పోలీసుబందోబస్తు



పూలంకరణతో సిద్దప్పపాలెం మారెమ్మవ్వ దేవాలయం

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో గ్రామదేవతలు మారెమ్మవ్వ దేవత ఉత్సవాలు మంగళవారం నుండి ప్రారంభం అయ్యాయి. కోసిగిలో 5సంవత్సరాలు తరువాత దేవర ఉత్సవాలను చేపటడంతో పెద్దెత్తున బంధువులు, స్నేహితులతో గ్రామం కళకళలాడుతుంది. దేవర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ మంజునాథ్, యస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో భారీపోలీసు బందోబస్తు నిర్వహించడం జరిగింది. కోసిగిలోని సిద్దప్పపాళెం, కడా పాళెం, చింతలగేరి, పోతులగేరి, నాడిగనగేరి, రంగప్పగట్టు కాలనీల్లో వెలసిన గ్రామదేవత ఉత్సవాలను చేపట్టడం జరుగుతుంది. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారి విగ్రహరూపాలతో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్టిస్తారు. బుధవారం ఉదయం మేళతాళాలతో కుంభాభిషేకంతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించుకొని మొక్కులు తీర్చుకుంటారు. దాదాపుగా 150మంది పోలీసులతో మంగళవారం సాయంత్రం గ్రామంలో కవాతును చేపట్టారు. దేవర ఉత్సవాల్లో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ మంజునాథ్, యస్ఐ చంద్రమోహన్ హెచ్చరించారు. అలాగే సిద్దప్పపాలెంలో భక్తులు అమ్మవారి దేవాల యాన్ని ప్రత్యేక పూల అలంకరణతో అలంకరించడంతో దేవాలయం కళకళలాడుతుంది.

# మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**గడివేముల మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గడివేముల జిల్లా పరిషత్ పాఠశాల నందు మంగళవారం నాడు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో అండర్ 14, అండర్ 17 క్రీడ పోటీలను జిందాల్ సీఈవో సుమిత్ చడ్డ, జిందాల్ ప్లాంట్ హెడ్ నవనీత్ చౌహాన్, సిఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, మాజీ జెడ్పిటిసి సీతారామిరెడ్డి, ఎస్సై నాగార్జున రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానియేల్, శ్రీ రాజరాజేశ్వరన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎం రామేశ్వరరావు, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చిన్నతనం నుండే క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉండే ఏదైనా సాధించవచ్చునని పోటీలలో ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటములు పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. మండలంలోని 12 పాఠశాల చెందిన 580 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భుజంగరావు తెలిపారు. కబడి, కోకో, క్యారం, చెస్సు పోటీలు నిర్వహించి క్రీడ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను, మెమోంట్లను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** మన సంస్కృతి సాంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేలా కళాశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. లలిత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మెహందీ సాంప్రదాయ వంటలు, సాంప్రదాయ వస్త్రాలంకరణ, ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు ప్రిన్సిపల్ లలిత తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. బడే సాహేబ్, డాక్టర్ వసుంధర, డాక్టర్ మహమ్మద్ గౌస్, మీటమ్మ, డాక్టర్ రామకృష్ణ, రామన్న, చంద్రకళ, రూపేశ్వరుడు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** విద్యార్థులు సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లె పట్టణ సి.ఐ ప్రవీన్ కుమార్ తెలిపారు. మంగళవారంనాడు రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ జూనియర్ కాలేజ్‌లో రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యూకేషన్ అండ్ అవెర్నస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో సి.ఐ ప్రవీన్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా కాల్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా , ఓటిపి, పిన్, సివివి లాంటివి అడిగితే చెప్పవద్దని ప్రతి విద్యార్థి ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ అంకన్న, ఎపిజిబి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి, యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రాచి, సత్తార్ బాష , కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్ రామలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ హర్షకుమార్, ట్రైనర్ అశోక్, రీసోర్స్ పర్సన్ నభిరసూల్ , గురు శేఖర్, కోఆర్డినేటర్ బాలాంజనేయులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు ఉచిత గుండె పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శైలజ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక కోర్టు సముదాయంలో ఆళ్లగడ్డబార్ అసోసియేషన్ అధ్యక్షులు పి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని మంగళవారం సివిల్ జడ్జి శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు ఉచితంగా ఈసీజీ, టుడి ఏకో, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శైలజ కూడా వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తులు కాశీభట్ల శివప్రసాదరావు, శివనాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు శివరాం రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, నీలకంఠేశ్వరం, మహబూబ్ బాషా, సరిత, రమాదేవి, రమణారావు, ప్రభాకర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సమస్యలను పరిష్కరించాలి

**– ఏపి రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య**

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, కౌలుదారు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబులయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం తీసుకురావాలనే డిమాండ్‌తో జగ్జీత్ సింగ్ దలేవాల్ గత 42రోజులుగా అమరణ నిరాహారదీక్ష చేపట్టి ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందన్నారు. తక్షణమే రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, అధ్యక్షులు నాగేంద్రయ్య, పంపన్నగౌడ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, సురేంద్ర కుమార్‌లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

# గుళ్ళదుర్తిలో పొలం పిలుస్తోంది

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** మండలంలోని గుళ్ళదుర్తి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఏవో నిరంజన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శనగ పంట, వివిధ రకాల పంటలను పరిశీలించి వాటికి సోకిన తెగుళ్ళ నివారణకు పలు సూచనలు, సలహాలు అందించారు. శనగ పంట ప్రస్తుతం పూత నుంచి పిందె దశలో ఉందని, పంట దశను బట్టి మందులను వాడాలని రైతులకు సూచించారు. రైతులు నాణ్యమైన మందులు వాడటం వల్ల తెగుళ్ళ నివారణకు సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరి పంటకు బీమా ప్రీమియం చెల్లించుటకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించారని, రైతులు ఒక ఎకరాకు రూ. 126 చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, వెటర్నరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో నిరంజన్

# కౌలు రైతులకు పంట వ్యవసాయ రుణాలు ఇవ్వండి

**– మండల వ్యవసాయాధికారి, నంద్యాల లీడ్ బ్యాంక్ మేనేజర్**

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని పట్టణంలోని ఎస్‌బీఐ, ఏపీజీబీ, కెనరా బ్యాంక్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్లను మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్, నంద్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రలను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పంట రుణం పొందని కౌలు రైతులు సేవింగ్ ఖాతా ఉన్న సంబంధిత బ్యాంక్ నందు అప్లికేషన్ అందించి పంట రుణాలను పొందాలని వారు పత్రికా ముఖంగా కోరారు. ఈ నెల 8,9 తేదీలలో అన్ని గ్రామాలలో కౌలు పంట రుణాల కోసం సదస్సులను నిర్వహిస్తున్నామని, రైతులు ఈ సదస్సులను ఉపయోగించుకొని పంటరుణాలను పొందాలని కోరారు. కౌలు రైతులు తమ ఆధార్, సీసీ ఆర్‌సీ, గుర్తింపు కార్డులు తీసుకొని సదస్సులో పాల్గొని బ్యాంక్ కరస్పాండెంట్‌కు అందజేయాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటశివ, తదితరులు పాల్గొన్నారు.


మేనేజర్‌తో మాట్లాడుతున్న వ్యవసాయ సిబ్బంది

# జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు..

**గడివేముల మేజర్ న్యూస్ :** మండలంలోని మంచాలకట్ట గ్రామంలో వెలసిన దివ్య బాల యేసు దేవాలయం నందు ఈనెల 11,వ తేదీన జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు రెవరెండ్ ఫాదర్ తోట జోసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 25000, రెండవ బహు మతి 20000,మూడవ బహుమతి 15000, నాలుగవ బహుమతి 10000,ఐదవ బహుమతి 5000, ఆరవ బహుమతి 3000,ఆర్ సీఎం సంఘం పెద్దలు అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు కబడ్డీ పోటీలకు సంబంధించి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ లు 8978 578533,9949861921,9573754480,9398562368,లను సంప్రదించి తమ టీమును రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

# ఇసుక తోడేళ్లను శిక్షించాలి

**ఆస్పరి, మేజర్ న్యూస్ :**

వెంగళాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలను నిషేదించాలని, ఇసుక తోడేళ్లను శిక్షించాలని వెంగళాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ వారు విరుపాక్షి, కైరుప్పుల గ్రామసర్పంచులు,ఆంజనేయ, వీరభద్రలు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ, ఆయకట్టు కింద ఖరీఫ్ సీజన్‌లో1000 ఎకరాలకు, రబీ సీజన్లో 500 ఎకరాలకు సాగునీటి పారుదల కలు, ఈ చెరువ మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో కలదు. ఈ చెరువులో సమృద్ధిగా భూగర్భ జలాలు ఉంటాయి. రైతుల పంట పొలాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు హనుమంతు, రామాంజనేయ, ఈరన్న, వెంకటేష్, చంద్ర, రంగప్ప, లాలు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న చెరువు పరివాహక పరిరక్షణ కమిటీ సభ్యులు

## ప్లాస్టిక్ నివారణపై వ్యాపారులకు అవగాహన కల్పించిన డి.ఎస్.పి



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న డి.ఎస్.పి శ్రీనివాసులు

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని అన్ని రకాల వ్యాపారస్తులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో డోన్ డి.ఎస్.పి శ్రీని వాస్ నిర్వహించారు. మంగళవారంనాడు బనగానపల్లె పట్టణంలోని వ్యాపారులందరూ ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా ఉండాలని ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలను ప్రొజెక్టర్ ద్వార డి.ఎస్.పి శ్రీనివాసులు వివరించడం జరిగింది. వ్యాపారాలకు ప్లాస్టిక్‌కు బదులుగా జూటూ, బట్ట తదితర బ్యాగులను ఉపయోగించాలని పర్యావరణాన్ని పరిరక్షించడంలో తమ వంతు బాధ్యత వహించాలని బనగానపల్లెను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి వ్యాపారుల సహకారం తప్పనిసరి అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ ప్రవీన్ కుమార్, ఎస్.ఐ దుగ్గిరెడ్డి, బనగానపల్లె పట్టణంలోని వస్త్ర ,కిరాణా, కూరగాయల వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# అదనపు ఛార్జీలను రద్దు చేయాలి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:**

టారిఫ్‌ల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న అన్ని రకాల అదనపు ఛార్జీలను రద్దు చేయాల ని అఖిల భారత రైతుకుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ నియంత్రణ మండలి సెక్రటరీకి ఐఎఫ్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే నాలుగుసార్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారం మోపిందని, మరోసారి వేలకోట్ల రూపాయల అదనపు భారాలు వేయడానికి బూటకపు విచారణ సాగిస్తున్న పరిస్థితుల్లో అన్ని రకాల ఛార్జీలను రద్దు చేయాలన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన వాటిని తిరిగి వెనక్కు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, బ్రహ్మయ్య, రాము, దామోదర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చిరస్మరణీయులు

# రేనాటి సూర్యచంద్రులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఒకరు వీరత్వంతోనూ, మరోకరు దాన గుణంలో పేరు ప్రఖ్యాతలు గాంచి రేనాటి సూర్య చంద్రులుగా కొనియాడబడుతున్నారని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న సింగిల్ విండో మాజీ చైర్మన్ బుడ్డా విశ్వనాథ్‌రెడ్డి స్వగృహంలో ఉన్న బుడ్డా వెంగళరెడ్డికి చెందిన బంగారు పతకాన్ని, దొరవారి శివశంకర్‌రెడ్డి ఇంట్లో ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఉపయోగించిన ఖడ్గాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ తాను పుస్తకాల్లో చదవడమేకానీ ప్రత్యక్షంగా చూడటం తనకు ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు. మనం ప్రతిరోజు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

# కొలిమిగుండ్ల సచివాలయంలో రెవెన్యూ సదస్సు

**తహశీల్దార్ బాలేశ్వర్ రెడ్డి అధ్యక్షతన**

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, భూముల కొలతలు, పట్టా దారు పాసు పుస్తకాల్లో పేర్లు మార్పులు, చేర్పులు లాంటి సమస్యలపై దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ ససదుసలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. కొలిమిగుండ్ల సర్పంచ్ జీవరాముడు, వి.నరసింహుడు, మంద విజయ్ కుమార్, నాగేశ్వర రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ప్రజ్ఞ విద్యార్థి



అభినందిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాల విద్యార్థి గురుతేజ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలోగురుతేజ మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థి గురుతేజను కళాశాల గౌరవాధ్యక్షులు నరసింహా రెడ్డి,చైర్ పర్సన్ హేమలత రెడ్డి, ప్రిన్సిపల్ శివరామిరెడ్డి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

# కూలీలకు రూ.300ల వేతనాలు అందిస్తాం



**కృష్ణగిరి మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 300 వేతనం అందిస్తామని అందుకు తగిన విధంగా పని చేయిస్తామని,ఎంపిడిఓ జి. మోహన్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు మాట్లాడారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ, పండ్ల తోటల పెంపకంలో తీసే గుంతలను కొలత ప్రకారంగా తీసుకొని రోజుకు రూ. 300ల కూలీ చొప్పున అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ నాగసులోచన,టెక్నికల్ అసిస్టెంట్లు,ఫిల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కలుగోట్లలో రెవెన్యూ సదస్సు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** మండలంలోని కలుగోట్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొని రెవెన్యూకు సంబంధించిన భూముల పంచాయితీ, తదితర సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను అర్జీల ద్వారా తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిపై విచారణ జరిపి ఎప్పటికప్పుడు పరిస్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పుల్లయ్య, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

## భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూసమస్యలను పరిష్కారించాడానికే రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండల తహశీల్దారు శ్రీనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామంలో స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అవరణంలో విఆర్వో నరసన్న అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూములు ఎన్నో ఏళ్ళ నుంచి పరిష్కారం కాని భూసమస్యలను పరిష్కా రించెందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే భూసమస్యల పై రైతులునుంచి21కుపైగా ధరఖాస్తూలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మండల ఇన్చార్జ్ సర్వేరు అళ్ళప్ప. విఆర్వో హెచ్. వీరారెడిడి. లలిత. రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులకు తక్షణమే జీతాలు మంజూరు చేయాలి

**ఓర్వకల్లు ,మేజర్ న్యూస్ :**

మండల కేంద్రంలోని జయరాజ్ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే జీతాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న అన్నారు. మంగళవారం జయరాజ్ ఇస్ పాత్ స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కార్మికులను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న సిఐటియు మండల నాయకులు వి సుధాకర్ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం గ్రామస్తులు రైతులు చదువుకునే యువతతో పరిశ్రమ ముందు ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేయడంతో స్థానిక యువతకు వంద మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారని అయితే నిల గడిచి ఏడు రోజులు దాటిపోయిన ఇంతవరకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని 15వేల జీతం చెప్పి3,4 వేల రూపాయలు తగ్గించి 11,12 వేల రూపాయలను మాత్రమే ఇస్తున్నారని పరిశ్రమ వద్దకు రావడం కోసం ఎటువంటి వాహనం గాని ఏర్పాటు చేయలేదని పరిశ్రమ యాజమాన్యం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కంపెనీనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజా కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28 వ తేదీ నుండి జూనియర్ నేషనల్ సెపక్ తక్రా ఛాంపియన్ షిప్ పోటీలు

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఈ నెల 28 వ తేదీ నుండి ఫిబ్రవరి 2వరకు 28 వ జూనియర్ నేషనల్ సెపక్ తక్ర ఛాంపియన్ షిప్ 2025 ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్ జాతీయ స్థాయి పోటీలు నంద్యాల శ్రీ రామకృష్ణ పీజీ కాలెజ్ కి సంబంధించిన శ్రీ కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియం లో జరుగుతాయని క్రీడాభారతి నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సెపక్ తక్ర ప్రాక్టీస్ చేస్తున్నటి వంటి విద్యార్థులు,సెపక్ తక్రకోచ్‌లు,అందరు కూడాఈ ఈవెంటలో పాల్గొని నేషనల్స్‌ని జయప్రదం చేయవలసిందిగాకోరారు. క్రీడాభారతి ఆధ్వర్యంలో జరుగుతున్న మొట్టమొదటి జాతీయ స్థాయి ఈవెంట్ కాబట్టి క్రీడాభారతి సభ్యులు, క్రీడాభిమానులు అందరూ కూడా ఈ కార్యక్రమానికి సహకరించి జయప్రదం చేయాలన్నారు. అనంతరం పోటీలకు సంబంధించిన బ్రోచర్ లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్రీడాభారతి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, క్రీడాభారతి నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్ , సెక్రెటరీ నిమ్మకాయలసుధాకర్, సెపక్‌తక్ర జాతీయ ఉపాధ్యక్ష్యులు శ్రీనివాసులు , నందికొట్కూరు క్రీడాభారతి ప్రెసిడెంట్ శ్రీధర్ క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్రీడా భారతి నంద్యాల జిల్లా అధ్యక్షులు సుధాకర్

# నంద్యాలలో ప్రొటోకాల్ వివాదం

(మొదటిపేజి తరువాయి..)


నూతన నంద్యాల రూరల్ తహశీల్దార్ కార్యాలయం

ఎమ్మెల్సీ ఇసాక్ బాషతో రెవెన్యూ వర్గాలు జరిపిన చర్చలు విఫలయ్యాయి. వివరాల్లోకి వెళితే...నంద్యాల రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌లు మంగళవారం ప్రారంభించారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ ఇసాక్ బాషకు పిలుపులే దు. ఆయనను పిలవకపోవడంతో రెవెన్యూ జిల్లా అదికారిపై తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. చివరికి కార్యాలయ ప్రారంభోత్సవ స్వాగత బ్యానర్లలో ఆయన ఫోటోతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫోటోకు చోటు కల్పించకపోవడం రెవెన్యూశాఖలో పెద్ద దుమారాన్ని రేపుతోంది. జనసేన సైనికులు ఇదే అంశాన్ని తీవ్రంగా త ప్పుపడుతున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఉప ముఖ్యమంత్రి ఫోటోను ఏర్పాటు చేయాల్సిన అధికారులు విస్మరించడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్థానికంగా ఉన్నా ప్రారంభోత్సవానికి పిలవకపోవడంతో ప్రోటోకాల్ వివాదానికి తెరలేపింది. ప్రారంభోత్సవ అనంతరం జరిగిన పొర పాటుపై రెవెన్యూ వర్గాలు ఎమ్మెల్సీతో మాట్లాడినట్లు తెలుస్తోంది. ప్రొటోకాల్ అంశాన్ని పర్యవే క్షించే డిఆర్ఓ రామునాయక్ దృష్టికి ఎమ్మెల్సీ తీసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన వివరణతో సంతృప్తి చెందని ఎమ్మెల్సీ శాసన మండలి ఛైర్మెన్‌కు ప్రాధమికంగా ఫిర్యాదు చేసినట్లు తెలు స్తోంది. ఈ అంశంపై ఎమ్మెల్సీ ఇసాక్ బాష మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ ప్రోటోకాల్ అంశాన్ని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి తన ని ఆహ్వానించకపోవడాన్ని రెవెన్యూ వర్గాలను అయన తీవ్రంగా తప్పు పట్టారు. శాసనమండలి సభ్యులహక్కులకు భంగం కలిగినట్లు అందుకు సంబందించిన కమిటీ దృష్టికి తీసుకొని వెళ్లనున్నట్లు తెలిపారు.

# టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని టీడీపీ నాయకులు మిక్కిలినేని శ్రీనివాసరావు, కోడాలి వేణుగోఫాల్ అన్నారు. మండల పరిధిలోని హోన్నూర్ క్యాంఫ్ గ్రామంలో ఎన్‌ఆర్‌జిఎస్ గ్రాంట్ కింద రూ. 5 లక్షలను నిధులతో డ్రైనేజీ,సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి రోడ్లు ఉన్న కాలనిలో ప్రభుత్వం నిధులను సమకూర్చి సీసీ రోడ్లు నిర్మిస్తుందన్నారు. దింతో గ్రామాలు అన్ని విధాలుగా భాగు పడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను అభివృద్ది చెయడంతో ముందు ఉందని ప్రభుత్వానికి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



## శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ అంశంపై 25రోజుల వర్క్‌షాపు సియస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యంవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేగవంతమైన డిజిటల్ మార్పుల యుగంలో సైబర్ భద్రతను నిర్ధారించడం అత్యంత కీలకం అన్నారు. ఈ వఅవగాహన సురక్షితమైన, భద్రమైన డిజిటల్ వాతావరణాన్ని ప్రోత్సహించే దిశగా ఒక ముందడుగు అని తెలిపారు. ఈవర్క్‌షాపులో రీసోర్స్‌పర్సన్ సావరీ మైండ్స్ సీఈఓ అమిత్ కుమార్ మాట్లాడుతూ సైబర్ మార్పులను గుర్తించడం రిస్క్ మేనేజ్‌మెంట్ డేటా ప్రొటెక్షన్, సైబర్ సెక్యూరిటీలో కొత్తగా వస్తున్న టెక్నాలజీల వంటి విభిన్న అంశాలను కవర్ చేస్తుందన్నారు. లక్ష్మి చైతన్య, ఫరూక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

# నూతన వేతన సవరణ కమీషన్ ను ఏర్పాటు చేయాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం నూతన వేతన సవరణ కమీషన్ ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. మంగళ వారం హెచ్ కైరవాడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యులు సమావేశం లో ఆయన మాట్లాడుతూ విద్యారంగం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశాస్త్రీయ విధానాలను ఏడానాడాలని కోరారు. మాతృభాష మాధ్యమాలను సమాంతర బోధన మాధ్య మాలుగా కోనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై మోపుతున్న యాప్ బారంను తగ్గించాలని కోరారు. ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ప్రతి పాదనలను విరమించుకోవాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యాను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చలన్నారు. ఈనెల 11వ తేదిన విజయ వాడలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్య



# రూ.7.87కోట్లతో కాలుష్య నిరయంత్రణ అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ) కింద కర్నూలు నగరంలో రూ.7.87కోట్లతో కాలుష్య నియంత్రణకు వీలుగా అభివృద్ధి నులకు ఆమోదం తెలిపామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కాలుష్య నియంత్రణలో భాగంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి సంబంధించిన కార్యచరణ ప్రణాళిక అమలుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా కర్నూలు నగరంలో గాలి నాణ్యత పెంచేందుకు వీలుగా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రీనరీ డెవలప్‌మెంట్, సర్కిల్స్ వద్ద వాటర్ ఫౌంటెన్, ఎండ్ టు ఎండ్ రోడ్ల చదును, జంక్షన్ అభివృద్ధి పనులను చేసి దుమ్ము, ధూళిని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉల్చాల జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ప్లాంటేషన్ చేపట్టి పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ వెంకటకిషోర్‌రెడ్డి, డీటీసీ శాంతకుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

# పరారీలో ప్రధాన నిందితులు

**- 5గురు అరెస్టు... రిమాండ్‌కు తరలింపు..**

**- నిందితులను జనసేన పరామర్శ**



కబ్జాకు గురైన భూమి ఇదే

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్:** రూ.30కోట్ల ఆస్తిని అప్పనంగా కాజేసిన నింధితులను జనసేనకు చెందిన కొందరు నాయకులు పరామర్శించడం పట్ల విమర్శలు గుప్పమంటున్నాయి. గత ఏడాది డిసెంబర్ 31న తప్పుడు డాక్యూమెంట్ సృష్టించి ఆదోని పట్టణం మండిగిరి నివాసకుడు యగ్గటి ఈశ్వరప్పకు చెందిన సర్వే నెం.321ఏలో ఆరున్నర ఎకరాల భూమిని రిజిష్టర్ చేయించుకున్న ప్రధాన నింధితులు ఆముదాల భాస్కర్, చాకలి ఈరన్నతోపాటు మరో ముగ్గురు పరారీలో ఉండగా, సహకరించిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌బాబు, డాక్యూమెంట్ రైటర్లు షేక్ మహబూబ్ బాష, షేక్ షబ్బీర్, సాక్షి ఇజియాజ్‌లను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ భూ కుంభకోణంలో సూత్రదారులు, పాత్ర దారులు ఎవరనేది ప్రశ్నార్ధకంగా మారిన క్రమంలో కొందరు జనసేన నాయకులు నింధితులను పరామర్శించడం పట్ల ఇతర రాజకీయ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. భూ కబ్జాదారులకు ఖచ్చితంగా కూటమి నాయకులు అండ ఉన్నారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితోపాటు కమ్యూనిస్టులు ముక్తకంఠంగా ఆరోపిస్తున్నారు. వీరి ఆరోపణలను నిజం చేస్తూ, జనసేన వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తుంది. ఏది ఏమైనప్పటికీ బ్రతికున్న మనిషిని చనిపోయాడని తప్పుడు ధృవీకరణ పత్రాలను సృష్టించి దాదపు రూ.30నుంచి 50కోట్లు విలువ చేసే భూమిని కాజేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని బాధితులు యగ్గటి ఈశ్వరప్ప, మోహన్‌కుమార్‌లు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లా రిజిష్టర్ అధికారులు ఆదోని సబ్ రిజిష్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిష్టర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు.

ప్రధాన నింధితుల కోసంగాలిస్తున్నాము. సిఐ, సూర్య మోహన్ రావు, ఆదోని భూ కుంభకోణానికి పాల్పడిన కేసులో బాధితులు ఆరుమందిపై ఫిర్యాదు చేశారు. తమ విచారణలో మరో నలుగురు నింధితులు పాత్ర తెలడంతో 10మందిపై కేసు నమోదు చేశాం. 5మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో 5మంది కోసం రెండు బృందాలు గాలింపు చేపట్టాయి. నింధితులు స్వయంగా తప్పుడుపత్రాలను సృష్టించారు. తమ విచారణలో పాత్ర ఉన్నట్లు తెలితే వారిపై కూడ కేసు నమోదు చేస్తాం.

# గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి



గణతంత్ర వేడుకలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఈనెల 26వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దడంతో పాటు జాతీయ పతాకావిష్కరణ, పెరేడ్ మార్చ్‌ఫాస్ట్‌లో సాయుధ దళాలు, ఎన్‌ఎస్ఎస్, ఎన్‌సిసి కేడెట్లు, స్కౌట్లు అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశభక్తి ఉట్టిపడే లా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే తక్కువ నిడివి గల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేసి ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధిని ప్రదర్శించాలన్నారు. ఈసమావేశంలో డీఆర్వో రామునాయక్, సీపీఓ వేణుగోపాల్, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, డ్వామా పీడీ జనార్ధన్‌రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈఓ జనార్ధన్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్ విభాగం ఏర్పాటు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ గైనిక్ విభాగంలో 20పడలతో అన్ని సదుపాయాలు హెచ్‌ఎంపీవీ వార్డు ఏర్పాటు చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలోని వివిధ విభాగాధిపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లా డుతూ ఈ వ్యాధి ప్రాణాంతకమైనది కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆసుపత్రిలో నిపుణులైన 6మంది వైద్యులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్యపరికరాలు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఈ వైరస్‌ను ఎదుర్కొవడానికి ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఎలాంటి హెచ్‌ఎంపీవీ కేసు నమోదు కాలేదన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరూ మాస్కులు, శానిటైజర్‌లు ఉపయోగించాలన్నారు. ఈ కార్య క్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు సీతారామయ్య, శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వ రరావు, మైక్రో బయాలజీ హెచ్ఓడీ రేణుకదేవి, అనస్తీషియా ప్రొఫెసర్ సుధీర్, పల్మనాలజీ హెచ్‌వోడీ శ్రీకాంత్, శివబాలనగాంజన్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# కోలుకోలేక వ్యక్తి మృతి





దమాల పాములేటి (ఫైల్ ఫోటో)

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని బుక్కాపురం గ్రామం వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు తిమ్మాపురం గ్రామానికి చెందిన దమాల పాములేటి (72) అనే వ్యక్తి బుక్కాపురం అలుగు వద్ద సోమవారం సాయంత్రం ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తుండగా కోలుకోలేక మృతి చెందారని అన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నావ ని అన్నారు.

# ఎమ్మెల్యే అఖిలప్రియ చేతుల మీదుగా బాధితులకు చెక్కుల పంపిణీ



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చెక్కులను అందజేశారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో రూ. 2.06 లక్షల విలువల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. దొర్నిపాడు మండలం చాకరాజు వేముల గ్రామానికి చెందిన గురు ప్రసాద్ కు రూ. 1.81 లక్షలు, డబ్ల్యూ గోవిందిన్నె చెందిన గురు ప్రసాద్ కు 25 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా బాదిత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థి ఆత్మహత్యాయత్నం..?

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆదివారం బాత్రూంలో క్లీన్ చేసే హార్పిక్ లిక్విడ్ ను తాగాడు. అతనిని కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చి ట్రీట్మెంట్ ఇప్పించారు. అయితే ఆత్మహత్యాయత్నం కావడంతో మెడికో లీగల్ కేసు నమోదు చేయించాల్సి ఉంటుంది. కానీ ఎటువంటి సమాచారం లేకుండా విషయం బయటకు రాకుండా ట్రీట్మెంట్ ఇప్పియ్యడం వల్ల కళాశాలలో ఒత్తిడి ఏమైనా ఉందా, అధ్యాపకులు ఏమైనా మందలించారా లేదా ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

**వివరణ..** ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్ ను వివరణ కోరగా..ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి చురుకుగా ఉంటాడని. కేవలం తల్లిదండ్రులను బెదిరించేందుకు తీసుకున్నాడే గాని ఆత్మహత్యయత్నం కాదన్నారు. విద్యార్థి కోలుకొని ఇంటికి వెళ్ళాడని పూర్తిగా వైద్యులకు చూపించి పాఠశాలకు పంపవలసిందిగా విద్యార్థి తల్లిదండ్రులకు తెలిపామని అన్నారు.

## మంత్రి బి.సిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖులు



మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మద్దిలేటిస్వామి ఆలయ సిబ్బంది

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు మౌళిక సదుపాయాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డిని పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. సెంట్రల్ పవన్ గ్రిడ్ గుత్తి డివిజన్ డిజిఎం , జి.ఎం మంత్రిని బి.సిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ ఇతర అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బేతంచెర్ల మండలంలోని శ్రీ మద్దిలేటిస్వామి ఆలయ సిబ్బంది అర్చకులు మర్యాదపూర్వకంగా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపి స్వామి వారి చిత్రపటాన్ని వారికి బహూకరించారు.

## పురుగుల మందు తాగి కోలుకోలేక వ్యక్తి మృతి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన తిప్పావతి పుల్లయ్య పలుకూరు గ్రామ పంచాయితీ నందు బిల్ కలెక్టర్‌గా కాంట్రాక్టు బేసిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి అప్పులు అధికం కావడంతో తాగుడుకు బానిసై వచ్చే జీతం సరిపోక అప్పులు ఎలా తీర్చాలో తెలీయక సోమవారం రాత్రి పంచాయితీ ఆఫీసు దగ్గర పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారంనాడు కోలుకోలేక మృతి చెందాడు. అతని కుమారుడు సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు నందివర్గం ఎస్.ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.